సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



జూరాలకు నిలకడగా వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం ఎగువ నుంచి 2.15 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది.

-8లో ▸



నిర్వాసితులకు భరోసా

ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /23.5

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



అలంపూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా జడ్జి ప్రేమలత అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం అలంపూర్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం జిల్లా జడ్జితో పాటు స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజను న్యాయవాదులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వల శ్రీనివాసులు, ఏపీపీ కార్తిక్ రాజ్, ఏజీపీ మధుసూదన్, ఎంఈఓ అశోక్‌కుమార్, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: బేగంపేట, రామనంతాపూర్‌లోని **హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో డేస్కాలర్‌గా ప్రవేశాల నిమిత్తం జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ అధికారి పవన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 జూన్ 1నుంచి 2019 మే 31వ తేదీ మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో పొందవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు నివాస, కులం, ఆదాయం, జనన ధ్రువ పత్రాల జిరాక్స్‌తో ఈ నెల 8వ తేదీలోగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. 12న లక్కీ డిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.**

7న సీపీఐ జిల్లా మహాసభలు



గద్వాల: జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో ఈ నెల 7న సీపీఐ జిల్లా 3వ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. దేశ ఐక్యత, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని హాని తలపెడుతున్నారన్నారు. రాజ్యాంగ మూలాలను నాశనం చేయాలనే ఉద్దేశంతోనే దళితులపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ వంటి నిత్యావసర ధరలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాలకు నాంది పలికేందుకు జిల్లా మహాసభల్లో పలు నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగన్న, ఖాసీం, ఉప్పేరు కృష్ణ, ప్రవీణ్, రవి, రామాంజనేయులు, తిమ్మప్ప, గోకారి పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

గద్వాల: ఫేక్ డీఎస్ఆర్ అటెండెన్స్ నమోదు చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడింది. మల్దకల్ మండలం విఠలాపురం, గట్టు మండలం బోయలగూడెం పంచాయతీ కార్యదర్శులు తిరుమలేశ్, శ్రీనివాసులును సస్పెన్షన్ చేసినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. లైవ్ డీఎస్ఆర్ అటెండెన్స్ నమోదు చేయకుండా ఫేక్ డీఎస్ఆర్ నమోదు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,100

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శనివారం 482 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 6,100, కనిష్టంగా రూ. 3,499, సరాసరి రూ. 5,090 ధరలు లభించాయి.

అమ్మ.. నాన్న.. ఫ్రెండ్



సర్వే ఇలా..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో మొత్తం 100 మంది నుంచి 'సాక్షి' బృందం శాంపిల్స్ సేకరించింది. యువత లక్ష్యంగా ఒక్కో జిల్లా నుంచి 20 మంది చొప్పున (మహిళలు–10, పురుషులు–10) అభిప్రాయాలు తీసుకుంది. ఎంచుకున్న నాలుగు ప్రశ్నలకు ఒక్కొక్కరి నుంచి సమాధానాలను రాబట్టగా.. స్నేహబంధంపై వారు 'సాక్షి'తో ముచ్చటించారు.

స్నేహమంటే ఇదేరా !

- తల్లిదండ్రుల తర్వాత స్నేహితులకే ప్రాధాన్యం
- మధురమైన జీవితంలో స్నేహబంధం మరుపురానిదని కితాబు
- మంచి స్నేహితులు ఒక్కరు చాలంటున్న యువత
- మారుతున్న పరిస్థితుల్లో విలువలు దిగజారుతున్నాయని ఆవేదన

'స్నేహానికన్న మిన్నా లోకాన లేదురా.. కడదాక నీడ లాగ నిను వీడిపోదురా.. నీ గుండెలో పూచేటిది, నీ శ్వాసగా నిలిచేటిది ఈ స్నేహమొకటేనురా..'

..స్నేహం గురించి తెలిపేలా ఓ కవి రాసిన మధుర గీతమిది. చిన్ననాటి నుంచి మొదలు చరమాంకం వరకు తీపి గుర్తులుగా మదిలో నిలిచేది స్నేహ బంధం. అందుకే జీవితంలో మధురమైనది, మరపురానిది అంటే స్నేహమేనని చెబుతారు. కాలంతో పాటు మారిన జీవన పరిస్థితుల్లో సైతం ఫ్రెండ్‌షిప్ అనేది యువత ఉన్నతిలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ మేరకు వారు ఏం కోరుకుంటున్నారు.. ఎలాంటి నేస్తం కావాలి.. వారికి మీరిచ్చే స్థానం ఏమిటి ? వంటి తదితర అంశాలపై 'సాక్షి' ఒక చిన్న ప్రయత్నం చేసింది. నేడు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా సర్వే నిర్వహించింది. తల్లిదండ్రుల తర్వాత స్నేహితులకే ప్రాధాన్యం అంటూ యువతీ యువకులు ఉత్సాహంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.


– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్




మీ దృష్టిలో ఫ్రెండ్‌షిప్ అంటే ?




స్నేహబంధం కూడా కలుషితమైందా ?



మీకు ఎంతమంది నిజమైన ఫ్రెండ్స్ ఉన్నారు ?



మీ స్నేహితులకు ఇచ్చే స్థానం ?



యువతీ యువకుల్లో భిన్నాభిప్రాయాలు..

స్నేహ బంధానికి సంబంధించి యువతీ యువకుల మధ్య కొంత మేర భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎంత మంది నిజమైన ఫ్రెండ్స్ ఉన్నారని ప్రశ్నిస్తే.. ఎక్కువ శాతం మహిళల నుంచి ఒక్కరే అని సమాధానం వచ్చింది. ఇద్దరికి మించి ఉన్నారని పురుషులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

కలుషితమవుతోందంటూనే మరపురానిదంటూ..

అన్ని బంధాల్లో కెల్లా స్నేహం ఒక్కటే చివరి వరకు నిలుస్తుందని యువత విశ్వాసం వ్యక్తం చేస్తోంది. అయితే ఆధునిక జీవనంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని.. పలు పరిణామాల క్రమంలో స్నేహ బంధం అనేది కూడా కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఫ్రెండ్‌షిప్ కూడా కలుషితమైందా ? అనే ప్రశ్నకు వంద మందిలో అవును అని 71 మంది సమాధానం ఇవ్వడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఏదేమైనా జీవితంలో మధురమైనది, మరపురానిది స్నేహ బంధమేనని చెబుతున్నారు.

ఎవరెవరు ఏమన్నారంటే..

వర్షిత: ఈ జగతిలో మధురమైనది, మరపురానిది స్నేహం మాత్రమే. జీవన పయనంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చివరకు తట్టుకొని నిలిచేదే నిజమైన స్నేహం.

మహేశ్వర్‌రెడ్డి: స్నేహితుడు అనే వాడు వెయ్యి పుస్తకాలతో సమానం. కావున మంచి స్నేహాన్ని ఎంచుకుని.. మన జీవితాన్ని మనం బంగారుమయంగా మార్చుకోవాలి.

నవ్యశ్రీ: స్నేహం అనేది స్వార్థం లేనిది. అలానే కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ఏర్పడేది స్నేహం.

అరవింద్: గాలి వస్తే ఆరేది దీపం.. రోజు గడిస్తే వాడేది పుష్పం.. మనిషి మరణిస్తే మిగిలేది దేహం.. కానీ ఎన్ని దశాబ్దాలు గడిచినా చివరకు మిగిలేదే నిజమైన స్నేహం.

అనఘ: మంచు కంటే చల్లనిది.. మల్లె కంటే తెల్లనిది.. వజ్రం కంటే విలువైనది స్నేహం మాత్రమే..

సుమన్ : కలిసి పోయే పక్షుల మధ్య.. కలిసి జీవించే జంతువుల మధ్య ఉండేది స్వార్థం లేని అసలైన ప్రకృతి ప్రసాదించిన స్నేహం. అటువంటి స్నేహం కూడా మన మధ్యనే ఉండాలి.

శ్రీజ: ఆపదలో ఆపద్బాంధవులు.. కష్టాల్లో కరుణామయులు స్నేహితులు మాత్రమే..

రుణ లక్ష్యం ఖరారు

రూ. 2998.57 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని నిర్దేశం



మల్దకల్ మండలం బిజ్వారం శివారులో వరిచేనులో యూరియా చల్లుతున్న రైతు

- వానాకాలంలో 88,356మంది, యాసంగిలో 58,902మంది రైతులకు ఆర్థిక తోడ్పాటు
- లక్ష్యం నెరవేరితేనే ప్రయోజనం

గద్వాలన్యూటౌన్: జిల్లాలో పంట రుణ లక్ష్యం ఖరారైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో 1,47,258 మంది రైతులకు రూ. 2998.57 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. నడిగడ్డ రైతాంగం బ్యాంకులు అందించే రుణాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. జూరాల, ఆర్డీఎస్ ప్రాజెక్టులతో పాటు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద ఏడు రిజర్వాయర్లు, వందకు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. ఏటా రెండు సీజన్లలో దాదాపు 5లక్షల ఎకరాల వరకు వివిధ రకాల పంటలను సాగు చేస్తుంటారు. పండ్లతోటలు, కూరగాయలు కూడా పండిస్తున్నారు. అయితే జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. రైతుభరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన వంటి పంట పెట్టుబడుల పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నా.. వాటితో రైతులు అవసరాలు పూర్తిగా తీరడం లేదు. దీంతో వీరంతా బ్యాంకులు అందించే పంట రుణాలపైనే ఆధారపడి సేద్యం చేస్తున్నారు. బ్యాంకర్లు సకాలంలో రుణాలు ఇవ్వకపోతే అధిక వడ్డీలకు ప్రైవేటులో అప్పులుచేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందిస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

■ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన పంట రుణ పరిమితి మేరకు బ్యాంకులు రైతులకు రుణాలు అందిస్తాయి. అందులో బాగంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయా బ్యాంకుల వారీగా రెండు సీజన్లకు రుణ లక్ష్యాన్ని లీడ్ బ్యాంక్ అధికారులు రూపొందించారు. వానాకాలంలో 88,356 మంది రైతులకు రూ. 1798 కోట్లు, యాసంగిలో 58,902 మంది రైతులకు రూ. 1200.58 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు. దీన్ని కొన్నిరోజుల క్రితం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఆమోదించారు.

టార్గెట్ మేరకు పంట రుణాలు అందిస్తాం




పంట పెట్టుబడుల్లో భాగంగా పంట రుణాలకు దరఖాస్తు చేసుకునే అర్హులైన రైతులందరికీ రుణాలు అందిస్తాం. 2025–26 ఆర్థిక సంవత్సరంలో టార్గెట్ మేరకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇందులో భాగంగా ఆయా బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించాం.

– శ్రీనివాసరావు, ఎల్‌డీఎం

బ్యాంకుల వారీగా రుణ లక్ష్యం ఇలా (రూ.కోట్లలో)

బ్యాంకు	వానాకాలం		యాసంగి	
	రైతుల సంఖ్య	రుణ లక్ష్యం	రైతుల సంఖ్య	రుణలక్ష్యం
బ్యాంక్ ఆఫ్ బరోడా	269	5.00	179	4.13
బ్యాంక్ ఆఫ్ ఇండియా	46	1.00	31	0.45
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	14	0.26	9	0.13
కెనరా బ్యాంక్	10,429	212.00	6,952	141.96
సెంట్రల్ బ్యాంక్	2,983	61.00	1,989	40.25
ఇండియన్ బ్యాంక్	9,030	184.00	6,020	122.49
పంజాబ్ నేషనల్ బ్యాంక్	140	3.00	93	1.73
ఎస్‌బీఐ	22,388	456.00	14,926	304.16
యూబీఐ	13,115	267.00	8,743	178.17
ఆక్సిస్	1,388	28.00	925	19.08
హెచ్‌డీఎఫ్‌సీ	8,173	166.00	5,448	111.40
ఐసీఐసీఐ	5,579	113.00	3,719	75.97
కరూర్ వైశ్య బ్యాంక్	277	6.00	185	3.40
కేబీఎస్	158	3.00	105	2.26
టీఎస్ కోఆపరేటివ్	3,272	67.00	2,181	44.03
గ్రామీణ బ్యాంక్	11,095	226.00	7,397	150.71



మానవపాడు మండలం చెన్నిపాడు శివారులో సాగుచేసిన పత్తి



హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో శనివారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా కలెక్టర్ బీఎం సంతోష్ అవార్డు అందుకున్నారు. నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్‌లో గట్టు మండలానికి ఆరు లక్ష్యాలను నిర్దేశించగా.. మూడింటిలో వందశాతం ఫలితాలు సాధించడంతో కాంస్య పతకాన్ని ప్రదానం చేశారు.

– గద్వాల

పాలమూరుపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం



డిజిటల్ బుక్స్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు జగదీశ్వర్‌రావు, సరిత

- అప్పుడే పూర్తి చేసి ఉంటే రిజర్వాయర్లలో కృష్ణానీళ్లు నింపుకొనేవాళ్లం
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అసంపూర్తి పనులకు నిధులు కేటాయిస్తాం
- అడ్వాన్స్ టెక్నాలజీతో ఐటీఐ ఏర్పాటు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కొల్లాపూర్: 'పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది.. ప్రాజెక్టు పనులు పూర్తిచేసి ఉంటే రిజర్వాయర్లలో కృష్ణానీటిని నింపుకొనేవాళ్లం.. పాలమూరు ప్రాజెక్టుతోపాటు జిల్లాలోని జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కేఎల్ఐ ప్రాజెక్టుల్లోని పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తాం.. ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తామని' రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యటించి.. పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం రాజాబంగ్లా ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులు, రేషన్‌కార్డులు, రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొల్లాపూర్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. 1980లో మల్లు అనంత రాములు నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేశారని, తాను అప్పుడు కొల్లాపూర్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరించానని పేర్కొన్నారు. మధిర ప్రజలతో ఉన్న అనుబంధమే కొల్లాపూర్ ప్రజలతోనూ ఉందన్నారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి, కొల్లాపూర్‌తో అను బంధం ఉన్న తాను ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు విజ్ఞప్తి మేరకు కొల్లాపూర్‌లో అడ్వాన్స్ టెక్నాలజీతో ఐటీఐ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గతంలో తొలగించిన బ్యాంకులన్నింటినీ తిరిగి గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులతో మాట్లాడతామన్నారు. శ్రీశైలం నిర్వాసితుల అంశం ఆర్థిక పరమైనది కాబట్టి దీనిపై పరిశీలన చేసి చెబుతానన్నారు. ముంపు బాధితుల కోసం జూపల్లి కోరిన 3 వేల అదనపు ఇళ్ల గురించి కలెక్టర్లతో మాట్లాడి సమాచారం తెలుసుకొని తగిన న్యాయం చేస్తానన్నారు.

అభివృద్ధికి సహకరించండి: మంత్రి జూపల్లి

కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు డిప్యూటీ సీఎంను కోరారు. ఇక్కడ ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేయాలని, శ్రీశైలం నిర్వాసితులకు పంచాయతీ కార్యదర్శి, లష్కర్ పోస్టులు ఇవ్వాలని, లేనిచో ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున అదనపు పరిహారం చెల్లించాలని, నిర్వాసితుల కోసం నియోజకవర్గానికి అదనంగా 3 వేల ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు.

డిజిటల్ బుక్స్ ఆవిష్కరణ..

ఐఐఎఫ్‌సీఎల్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ విద్యార్థుల కోసం రూపొందించిన డిజిటల్ బుక్స్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. వీటికి సహకరించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిని ఆయన అభినందించారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్ రావు, ఒబేదుల్లా కొత్వాల్, సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శిస్తే బుద్ధి చెప్పండి: ఎంపీ మల్లురవి

ముగ్గురు, నలుగురు సీఎంలు మారినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి.. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారి, సోమశిల– సిద్ధేశ్వరం బ్రిడ్జిని మంత్రి జూపల్లి కృష్ణారావు సాధించారని ఎంపీ మల్లురవి అన్నారు. సీఎంను, డిప్యూటీ సీఎంను, మంత్రులను, ప్రభుత్వాన్ని ఎవరైనా అనవసరంగా విమర్శిస్తే వారికి కుక్కకాటుకు చెప్పుదెబ్బ తరహాలో బుద్ధిచెప్పాలని పార్టీ శ్రేణులకు సూచించారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రూ.899 కోట్లు కేటాయించాలని, పాలమూరు ప్రాజెక్టు పనులకు రూ.5 వేలు లేదా రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సీఎంను కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కొత్తగా 50 గ్రామీణ లైబ్రరీలను సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేయబోతున్నామని, అందులో 8 లైబ్రరీలు కొల్లాపూర్ ప్రాంతంలోనే ఉంటాయన్నారు.

వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని సహించం

గద్వాల క్రైం: ప్రజలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మానిటరింగ్ అధికారి ఫణీందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి.. రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, వైద్యుల పనితీరు, స్కానింగ్ పరికరాల వినియోగం, మౌలిక వసతులు తదితర వివరాలను సూపరింటెండెంట్ ఇందిరతో తెలుసుకున్నారు. ప్రసవాల కోసం వచ్చే గర్భిణులకు సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవం చేయాలని వైద్యులకు సూచించారు. అత్యవసరమైతేనే సిజేరియన్ చేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌లో మందుల నిల్వ వివరాలను ఫార్మసిస్టుతో తెలుసుకున్నారు. ప్రమాదకర వ్యాధులు, శస్త్ర చికిత్సల కోసం అందజేసిన మందులు, రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అందుబాటులో లేని మందుల కోసం సమర్పించిన నివేదికలపై ఆరా తీశారు. కాగా, టెక్నీషియన్ పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని సూపరింటెండెంట్ తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. మానిటరింగ్ అధికారి వెంట సిబ్బంది కౌటిల్య, వేణుగోపాల్, శ్రీనివాసులు, అభినేష్, రాజు, మధుసూదన్‌రెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.



జిల్లా ఆస్పత్రిలోని మెడిసిన్ స్టోర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారి ఫణీందర్‌రెడ్డి

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాలు ఢీ : మహిళ దుర్మరణం

ధరూరు: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని జాంపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సరోజనమ్మ (58), గోవింద్‌రెడ్డి దంపతులు ఒక ద్విచక్ర వాహనంపై, అల్లుడు రంగారెడ్డి మరో ద్విచక్ర వాహనంపై గద్వాలకు బయలుదేరారు. మండలంలోని జాంపల్లి శివారు తాయమ్మమిట్ట సమీపంలో వెనుక వస్తున్న గోవింద్‌రెడ్డి వాహనం ముందున్న రంగారెడ్డి వాహనాన్ని ఢీకొట్టడంతో సరోజనమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. గోవింద్‌రెడ్డి దంపతులు కొన్నిరోజులుగా రాయిచూరులో ఉంటుండగా.. పని నిమిత్తం స్వగ్రామానికి రాగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న రేవులపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మహేష్ (ఫైల్)

కోస్గి రూరల్: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా.. ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం పద్మారం గ్రామానికి చెందిన మహేష్ (22) కోస్గిలో వ్యాపారం చేసుకుంటూ అక్కడే తన మేనమామా వద్ద ఉంటుండేవాడు. కోస్గికి చెందిన బెజ్జు నవీన్, శివ, మహేష్ ముగ్గురు మిత్రులు కలిసి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గుండుమాల్‌కు వెళ్లి తిరుగు పయనమాయ్యారు. దామరగిద్ద మండలానికి చెందిన మణి తన కారులో కోస్గి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యంలో మండలంలోని కడంపల్లి శివారులో బైక్‌ను ఢీకొట్టడంతో కిందపడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మహేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మహేష్ మృతదేహానికి శనివారం మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శివ, నవీన్ పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు. మహేష్ మేనమామా వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఏఎస్‌ఐ అంజనేయులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాఘవేందర్ (35) శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించిన మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృత్యుడి భార్య లక్ష్మమ్మతో పాటు ముగ్గురు కూతుర్లు, కుమారు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబ్‌లు శ్రీనువాసులు తెలిపారు.

గడ్డిమందు తాగి బలవన్మరణం

అమరచింత: కడుపునొప్పి భరించలేక గడ్డిమందు తాగి గొల్ల రాములు (34) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని హెడ్‌కానిస్టేబుల్ రాములు తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లికి చెందిన గొల్లరాములు ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడని, వైద్యసేవలు పొందినా కడుపునొప్పి తగ్గకపోవడంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న రాములును ఆత్మకూర్ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. మృతుడి భార్య గొల్ల రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



ఆత్మకూర్: గ్రామీణప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో హెచ్ఐసీసీ వేదికగా ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో అంతర్జాతీయ గోల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన సమ్మిళిత ఫౌండేషన్ విద్యార్థి పవన్‌కళ్యాణ్, భారత జట్టు కోచ్‌గా ఎంపికైన సంస్థ డైరెక్టర్ గాండ్ల శివకుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డితో కలిసి చెక్కు అందజేశారు. ఈజిప్టులో సెప్టెంబర్‌లో జరిగే గోల్‌బాల్ క్రీడలకు ఇరువురు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ సోనిబాల దేవి, మార్కెట్‌ఛైర్మన్ రహ్మతుల్లా పాల్గొన్నారు.

జూరాలకు నిలకడగా వరద


జూరాల 17 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- ఎగువ నుంచి 2.20లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 17 క్రస్టుగేట్ల ఎత్తివేత

ధరూరు/ఆత్మకూర్/దేవరకద్ర/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి 8గంటల వరకు ప్రాజెక్టుకు 2.15లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 7:30 గంటల వరకు 2.20లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 17 క్రస్టుగేట్లను ఎత్తి 1,68,674 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 24,855, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 650, సమాంతర కాల్వకు 600, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 1,97,138 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 7.817 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే, ఆల్మట్టి ప్రాజెక్టుకు 1,29,529 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 98,927 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,2,472 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 25 గేట్లను ఎత్తి 97,421 క్యూసెక్కుల నీటిని దగువకు విడుదల చేస్తున్నారు.

405.284 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతోంది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు (184.996 ఎం.యూ.), దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు (220.288 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఇప్పటివరకు 405.284 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

■ కోయిల్‌సాగర్‌లో 26 అడుగులకు నీటిమట్టం చేరింది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉంద్యాల ఫేజ్–1 పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మరో 0.6 అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి నీటిమట్టం చేరుతుంది.

■ సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 15,516 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు సీఎం భరోసా

- తాజాగా రూ. 175కోట్లు విడుదల
- డిసెంబర్ 9లోగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తిగా చెల్లింపు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సీఎం మాటగా నిర్వాసితులకు చెప్పేందుకు గాను ఆదివారం ఉదండాపూర్‌లో పార్టీలకు అతీతంగా సహపంక్తి భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 9వ తదీలోగా పూర్తిగా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెలిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందులో భాగంగానే గతేడాది జూన్‌లో రూ. 45కోట్లు, ఈ ఏడాది జనవరిలో రూ. 30కోట్లు, తాజాగా రూ. 175కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. ఉదండాపూర్ గ్రామ అవార్డు పాస్ అయితే మరో రూ. 200కోట్లు తీసుకొస్తామన్నారు. నిర్వాసితులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే సమావేశానికి వెళ్లి తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా కర్వెన వరకే పనులు పూర్తి చేయాలనే ప్రతిపాదనను తాను వ్యతిరేకించి.. ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని పట్టుబట్టినట్లు తెలిపారు. తన వాదనతో ఏకీభవించిన ప్రభుత్వం పనుల కొనసాగింపు దిశగా ముందుకు సాగుతోందన్నారు. నిర్వాసితుల త్యాగాల ఫలితంగా 8లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. ఇక ఆర్‌అండ్‌ఆర్ రూ. 16.30లక్షల నుంచి రూ. 25లక్షలకు పెంపు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఇక జడ్చర్ల సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి పాతబజార్ వైపు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా డిజైన్ ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు త్వరలోనే అధికారిక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇక మహనీయుల విగ్రహాలను డిగ్రీ కళాశాల సమీపంలో రహదారిని అనుసరించి ఏర్పాటుచేస్తే బాగుంటుదని భావిస్తున్నట్లు తెలిపారు. జడ్చర్ల బైపాస్ రోడ్డుకు సంబంధించి అధికారిక డీపీఆర్ తర్వాత స్పష్టత వస్తుందన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పుష్పలత, మాజీ జెడ్పీటీసీ శివకుమార్ తదితరులు ఉన్నారు.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం శిబిరంలో పాల్గొన్న వీసీ శ్రీనివాస్

పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దానాల్లోకెల్ల రక్తదానం గొప్పదని, మనం రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడమేనని వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పీయూలో ఎన్ఎస్ఎస్ సెల్, ఎస్‌వీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. అనేక ఇబ్బందులతో రక్తదానం అందక చాలామంది చనిపోతున్నారని, వారిని ప్రాణాపాయ పరిస్థితిలో ఆదుకోవాలంటే రక్తదానం చేయడం ప్రతిఒక్కరికీ సామాజిక బాధ్యత అని తెలిపారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ మాట్లాడుతూ.. పీయూలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సఖ్యలో రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేసిన వారికి ఒక సంవత్సరం మెంబర్‌షిప్ కార్డును ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌వీఎస్ ఇన్‌చార్జి బస్వరాజ్, ప్రోగ్రాం అధికారులు గాలెన్న, రవి కుమార్, అర్జున్‌కుమార్, చిన్నాదేవి, ఈశ్వర్ కుమార్, జ్ఞానేశ్వర్, శివకుమార్‌సింగ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక నిఘా


చౌదర్‌పల్లి శివారులో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

దేవరకద్ర రూరల్: జిల్లాలో చోరీలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపారు. మండలంలోని చౌదర్‌పల్లి శివారులో ఆంధ్రకు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా నాటుకోళ్ల పెంపకం సాగిస్తున్నారు. గత నెల 22న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అక్కడ పని చేస్తున్న వారిపై దాడిచేసి, బంధించి ఫామ్‌లో ఉన్న నాటుకోళ్లను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.10 లక్షలకు పైగానే ఉంటుందని సమాచారం. ఈ ఘటనపై బాధితుడు అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేయగా బయటకు పొక్కకుండా దర్యాప్తు చేపడుతున్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల కిందట కొల్లాపూర్‌లో జరిగిన దొంగతనం, ఇక్కడి జరిగిన దొంగతనానికి పోలికలు ఉండటంతో శనివారం ఎస్పీ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బాధితులకు భరోసానిచ్చారు. ప్రజలు భయాందోళనలకు గురి కావద్దని.. రక్షణకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఆమె వెంట సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ నాగన్న ఉన్నారు.

కురుమూర్తికి తరలివచ్చిన భక్తులు

- ఆలయంలో ప్రత్యేక పూజలు
- కొండ దిగువన దాసంగాలు


కురుమూర్తి స్వామి ఆలయం వద్ద దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: సీసీకుంట మండలంలోని అమ్మాపురం సమీపంలోని కాంచనగుహంలో కొలువైన కురుమూర్తి స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. శ్రావణ శనివారం సందర్భంగా అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు కొండదిగువన దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

‘బీసీ బిల్లుసాధనకు ఏకమై కదులుదాం’



మాట్లాడతున్న యూపీఎఫ్, తెలంగాణ జాగృతి నాయకులు

మెట్టుగడ్డ: బీసీ బిల్లు సాధనకు ఈనెల 4, 5, 6, 7తేదీల్లో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టనున్న 72గంటల నిరాహార దీక్షకు బీసీలంతా ఏకమై కదలాలని యూపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ విజయేందర్‌సాగర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శనివారం విలేకరులతో మట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీల కోసం పోరాడుతున్న కవితకు మద్దతుగా మనమందరం కదిలి సత్తా చాటుదామన్నారు. బీసీ రిజర్వేషన్‌పై మోసపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ, కాలయాపన చేస్తూ ప్రధానిని కలుద్దాం, అక్కడే ధర్నాలు చేద్దామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని ఎండగట్టాలని ధ్వజమెత్తారు. సమావేశంలో యూపీఎఫ్ సలహాదారు అనూష, తెలంగాణ జాగృతి మహబూబ్‌నగర్ కన్వీనర్ వెంకటరామమూర్తి, ప్రభాకర్, గంగాధర్, నయూముద్దీన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా డబ్బులు ఇవ్వాలని తల్లిపై దాడి

ఉండవెల్లి: రైతుభరోసా డబ్బులు తమకు ఇవ్వాలని కన్నతల్లిపై కొడుకులు దాడిచేసిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని కలుగొట్లకు చెందిన కుర్వ లక్ష్మీదేవికి ఇద్దరు కుమారులు. రెండేళ్ల క్రితం భర్త మృతిచెందాడు. అప్పటినుంచి ఆమెను కొడుకులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఒంటరిగా జీవిస్తుంది. కలుగొట్లలో ఆమెకు వ్యవసాయ భూమి ఉండగా..ఆ పొలాన్ని ఇద్దరు కొడుకులు సాగుచేసుకుంటున్నారు. రైతుభరోసా నగదు ఆమె ఖాతాలోనే జమ అవుతుంది. ఈ క్రమంలో శనివారం ఆమె పెద్దకుమారుడు శంకర్ రైతుభరోసా డబ్బులు తనకే ఇవ్వాలని తల్లిని బెదిరించడంతోపాటు కర్ర తీసుకుని దాడిచేయడంతో తలకు గాయమైంది. పదిరోజుల కిందట చిన్న కుమారుడు మల్లికార్జున్ కూడా ఆమెను రైతుభరోసా డబ్బుల కోసం కొట్టాడని తెలిపింది. ఈ ఘటనల నేపథ్యంలో శనివారం ఉండవెల్లి పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిభ గల క్రీడాకారులకు ఎండీసీఏ చేయూత

- ముగ్గురికి ఉచిత వసతి, భోజన సౌకర్యం
- ఒక్కొక్కరిపై ఏడాదికి రూ.లక్షన్నర ఖర్చు
- ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్


క్రీడాకారులకు సైకిళ్లు అందజేస్తున్న రాజశేఖర్

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రతిభగల క్రీడాకారులకు ఎండీసీఏ చేయూత అందిస్తుందని ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శనివారం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని ఎండీసీఏ మైదానంలో క్రికెట్ క్రీడాకారులు నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్‌కు చెందిన జస్వంత్, పాలెంకు చెందిన గగన్, అచ్చంపేటకు చెందిన రాంచరణ్‌కు ఎండీసీఏ తరపున సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇటీవల వేసవిలో జరిగిన ఇంట్రాడిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో ప్రతిభ కనబరిచిన పైముగ్గురు క్రీడాకారులను గుర్తించి వారికి ఎండీసీఏ తరపున అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడాకారులకు ఎండీసీఏ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో వసతి, భోజన సౌకర్యం కల్పించేడం జరిగిందన్నారు. వారికి క్రికెట్ పరంగా అన్ని వసతులు సమకూర్చినట్లు తెలిపారు. అదేవిధంగా వారిని ప్రైవేట్ కళాశాలల్లో చేర్పించి చదువుకోవడానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఇలా ఒక్కో క్రీడాకారుడిపై ఏడాదికి రూ.లక్షన్నర ఖర్చును ఎండీసీఏ భరిస్తుందన్నారు. ఒక్కొక్కటి రూ.6500 విలువగల మూడు సైకిళ్లు అందజేయడం జరిగిందన్నారు. మైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వారికి క్రికెట్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులకు ఎండీసీఏ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభచాటి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మిలిటెంట్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలి




జడ్చర్ల టౌన్: పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, చట్టాలను పూర్తిగా పెట్టుబడిదారులు, యాజమాన్యాలకు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తాకట్టు పెట్టేసిందని, వాటిని తిరిగి పొందేందుకు మిలిటెంట్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో రెండురోజుల సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించి కార్మిక ఉద్యమ చరిత్ర సీఐటీయూ విశిష్టత అంశంపై బోధించారు. కేంద్రం తీసుకొస్తున్న లేబర్‌కోడ్‌లతో భవిష్యత్‌లో కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడి యజమానులు చెప్పిందే వేదంగా పనిచేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కార్మికుల సంఘాలు స్వేచ్ఛను పూర్తిగా కోల్పోతారన్నారు. శిక్షణ తరగతులు ఆదివారం కూడా కొనసాగనున్నాయి. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సహాయ కార్యదర్శి సత్తయ్య, కోశాధికారి చంద్రకాంత్, అంగన్‌వాడీ, ఆశ, జీపీ, మున్సిపల్, మధ్యాహ్న భోజనం, వీఓఏలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వ్యక్తి మృతి

సరైన వైద్యం అందక చనిపోయాడంటూ బంధువుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు


సాబేర్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: ఆస్పత్రికి వచ్చిన వ్యక్తికి వైద్యులు సరైన వైద్యం అందించకపోవడంతో మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేసిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పట్టణంలో ఉంటూ కంటి అద్దాల దుకాణం నడిపే సాబేర్ (45)కు శనివారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు వెంటనే పట్టణంలోని వెంకటరమణ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే ఈసీజీ తీసి కొన్ని మందులు ఇచ్చి తిరిగి పంపించారు. ఇంటికి చేరుకున్న తర్వాత నొప్పి అధికం కావడంతో తిరిగి తీసుకురాగా ఆస్పత్రిలో కుప్పకూలాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

■ సాబేర్‌కు సరైన వైద్యం అందకనే మృతిచెందాడని.. ఆరోగ్య పరిస్థితి గురించి ముందే చెప్పినా హైదరాబాద్ తీసుకెళ్లేవారమని బంధువులు శనివారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డ్యూటీ డాక్టర్‌ను తమతో మాట్లాడించాలంటూ నిర్వాహకులతో వాగ్వావాదానికి దిగారు. చివరకు పట్టణంలోని కొందరు నాయకులు, ఇతర పెద్దలు ఆస్పత్రికి చేరుకొని యాజమాన్యంతో మాట్లాడి రూ.లక్షల్లో సాయం అందించేలా ఒప్పందం చేసుకొని ఎలాంటి కేసు లేకుండా వివాదాన్ని సద్దుమణిగించారు.

220 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

ఇద్దరు యువకులకు రిమాండ్


గంజాయితో పట్టుబడిన యువకులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇటీవల జిల్లాలో ఎండు గంజాయి సరఫరా పెరిగింది. తాజాగా ఇద్దరు యువకులు 220 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సీఐ వీరారెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి శనివారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని బైపాస్ చౌరస్తా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ బైక్‌పై హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రియాజ్, సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ 220 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. చిన్న చిన్న పాకెట్‌లలో ఎండు గంజాయిని విక్రయించేందుకు జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు తెలిసింది. వీరి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పట్టుబడిన యువకులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎండు గంజాయిని పట్టుకున్న బృందాన్ని ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధాకర్ అభినందించారు.

భూ రిజిస్ట్రేషన్ ఆపాలని..

- పురుగు మందు డబ్బాతో రైతు హల్‌చల్

గట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం భూ రిజిస్ట్రేషన్ ఆపాలని ఓ రైతు పురుగు మందు డబ్బాతో హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గట్టు గ్రామ శివారులోని సర్వే నంబర్ 7లో ఉన్న కొంత భూమిని యజమాని గడ్డం నర్సింహులు మరో వ్యక్తి వడ్డె పరుశరామ్‌కు విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. శనివారం ఇరువురు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే గట్టుకు చెందిన రైతు తెలుగు శంకర్ పురుగు మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాడు. తాను ఇదే సర్వే నంబర్‌లోని భూమిని కొనుగోలు చేసేందుకు గతంలో ఒప్పందం చేసుకున్నానని.. తనకు విక్రయించకుండా మరొకరికి ఎలా విక్రయిస్తారంటూ ప్రశ్నించాడు. భూ రిజిస్ట్రేషన్ ఆపాలని.. తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేందుకు యత్నిస్తుండగా అక్కడే ఉన్న కార్యాలయ సిబ్బంది అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసుల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. అయితే భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలిసింది.